కథా నిలయం
శ్రీకాకుళం

# ఫారిన్ సెంటు

బంధువుల కుర్రాడు సతీష్ అమెరికాలో ఉద్యోగం వచ్చిందంటూ ప్రయాణానికి ముందు వచ్చి అక్షింతలు వేయించుకుని, ఆశీర్వాదం తీసుకుని వెళ్లాడు. ఓ నెలరోజుల వ్యవధిలో అతగాడి తండ్రికి ఫోన్ చేసి సతీష్ యోగక్షేమాలు తెలుసుకున్నాను. అతను వుండే నివాసానికి, పనిచేయవలసిన ఆఫీసుకు దాదాపు అరవై కిలోమీటర్ల దూరమట. అయినా అతి చక్కని రహదార్లు, అత్యంత ఆధునికమైన కారువల్ల అరవై కిలోమీటర్ల దూరాన్ని ఇరవై నిమిషాలలోపే చేరుకుంటాడట.

అదే మనకయితే అరవై కిలోమీటర్ల దూరాన్ని మన గతుకుల రోడ్ల వెంట, అందులోనూ ఎర్ర బస్సెక్కి వెళ్లాలంటే... చెయ్యి ఎత్తితే చాలు ఆపవలసిన బస్సయితే మూడు గంటల్లోనూ, కాకపోతే రెండు గంటల్లోనూ చేరుకోగలమేమో? అదీ మధ్యలో రాస్తారోకోలూ వగైరాలు లేకపోతే.

గుడ్డలు విప్పుకోవటంలోను, గంతులు వేయటంలో, గడ్డాలు పెంచుకోవటంలో, జడలు కత్తిరించుకోవడంలో, చేతుల్లేని జాకెట్లు వేసుకోవడంలో మనకి ఇతర దేశాలు ఆదర్శంగానీ, చక్కని రోడ్లు వేసుకోవడంలో, కష్టపడి పనిచేయడంలో, పనిచేసి మాత్రమే, కష్టపడి మాత్రమే డబ్బులు సంపాదించాలనుకోవడంలో మనం ఎవర్నీ ఆదర్శంగా తీసుకోలేం. అసలా విషయాలు మనకి గిట్టవు అలాంటి మాటలు ఎవరైనా చెప్తే శంఖారావమే అయిపోతుంది.

తాగి తందనాలు వేయటానికి, అడ్డమైన గడ్డీ తినటానికి ఇంకొకళ్ళని అనుకరిస్తాం గానీ వాళ్ళ దగ్గరున్న మంచి నేర్చుకోవటానికి మన మనసు అంగీకరించదు. మాటలు చెప్పటానికి, పనులు ఎగ్గొట్టి కూర్చోవటానికి, సోమరితనానికి మనతో ఎవ్వరూ సాటిరారు. శ్రమైక జీవన సౌందర్యం

మనం మాటల్లో చూపెడితే, వాళ్ళు చేతల్లో చూపెడతారు. అదీ తేడా అని తెలుసుకున్నాను, సతీష్ తన తండ్రికి వ్రాసే ఉత్తరాల్లోని విషయాలు విన్నప్పుడు.

'అమెరికాలో రోడ్లు... అబ్బో బ్రహ్మాండంగా వుంటాయట" అనుకునే మనందరికీ మన రోడ్లు ఇలా ఎందుకుంటున్నవో తెలీదూ? "రహదారులు మన నాగరికతకు చిహ్నాలు" లాంటి స్లోగన్స్ అందంగా వ్రాసి పెట్టడంలో మాత్రం మనకు మనమే సాటి! రహదార్లకి వెచ్చించాల్సిన నిధులన్నీ అడ్డదారుల్లో, దొడ్డిదారుల్లో తరలిస్తూ నిజాయితీగా బ్రతకటం చేతకాక చస్తూ బ్రతుకుతున్న వాళ్లం కదా మనం!

రెండు నెలలు గడిచాక ఓ సాయంత్రం సతీష్ తండ్రి శేషగిరి మా ఇంటికి వచ్చాడు. ఉభయకుశలోపరి పూర్తయ్యాక సతీష్ సంగతులు చెప్తూ రెండు రోజుల క్రితమే కొడుకు, తన పేరు మీద అయిదు వందల డాలర్లకు చెక్కు పంపినట్టు సంబరపడుతూ చెప్పేడు శేషగిరి. అయిదు వందల డాలర్లంటే దాదాపు ఇరవై వేల రూపాలయకంటే ఎక్కువే. సగటున నెలకు పదివేల పైమాటే. అంటే ఏడాదికి ఒకలక్షా ఇరవై వేలన్నమాట. చకచకా లెక్కలు వేసేసింది నా మనసు. తన సంతోషాన్ని నాతో పంచుకుని కాసేపు కబుర్లాడి వెళ్లిపోయాడు శేషగిరి.

నా చిన్నతనంలో పేకాట ఆడి ఎకరాల కొద్ది పంట పొలాన్ని లక్షల కొద్దీ ఆస్తుల్ని పోగొట్టుకున్న వార్ని గురించి చాలా విన్నాను. అప్పటికన్నా ఆ జోరు కాస్త ఇప్పుడు తగ్గిందని నా అభిప్రాయం. అయితే అందుక్కారణం మనుషుల్లో పరివర్తన రావటం కాదు. అంతకన్నా ఆకర్షణీయమైన అవకాశాలు చాలా అందుబాటులోకి రావటం అసలైన కారణం. పైగా ఆ అవకాశాలు జూదం కిందరాని ప్రభుత్వంవారి పథకాలు కావటం విశేషం. అప్పటికీ, ఇప్పటికీ పేకాట ఆడటం నేరమే. దినపత్రికల్లో అప్పుడప్పుడు 'పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు' అనే వార్తలు చదువుతూనే వుంటాం.

పూర్వం రోజుల్లో డబ్బు పోగొట్టుకునేందుకు, కుటుంబాలు వీధిన పడేందుకు అదొక్కటే వ్యసనంగా వుండేది ఎక్కువగా. కాని ఇప్పుడో! ఎన్ని స్కీములు, ఎన్ని బోగస్ సంస్థలు! ఎన్ని రాయితీలు ఎన్ని రకాల సులభ వాయిదాలు.. అన్నీ సులభంగా ప్రజల్ని బోల్తా కొట్టించేవే. అయితే ఏం లాభం. ఎంతమంది ఎన్ని రకాలుగా మోసపోయిందీ వింటున్నా, చూస్తున్నా, మనదాకా వచ్చేసరికి మళ్ళీ ఆశ మనల్ని జయించేస్తున్నది. ఊబిలో కూరుకుపోతూనే ఉన్నాం.

ఎంత సంపాయించాడన్నది ముఖ్యమైపోయింది గాని ఎలా సంపాదించాడనేది అనవసరమైపోయింది. సంపాదనే సమర్థతకు గీటురాయి. మోసగాళ్లందరూ మొనగాళ్లుగా చలామణి అవుతున్నారు. ఇదివరకు అధికారులకు గ్రేడ్ వన్, గ్రేడ్ టు అని విభజనలు, గుర్తింపులూ వుండేవి. ఇపుడు వాళ్ళకా గుర్తింపు ఉంచారో, ఊడబీకారో తెలీదు గానీ రౌడీ షీటర్లకు ఆ గ్రేడింగ్‌లు ఇచ్చారు. ఆ గ్రేడింగ్‌ని వారు బిరుదులుగా భావిస్తున్నారు.

సతీష్ అమెరికాలో వుంటున్న ఓ ఆంధ్రా అమ్మాయిని ప్రేమించాడట. ఆ అమ్మాయి కూడా సతీష్‌ని పెళ్ళాడేందుకు అంగీకరించిందట. ఉద్యోగస్థురాలు కూడా కావడంతో కట్నకానుకల విషయంలో పెద్దల ప్రమేయం ఏమీలేకుండానే అమ్మాయి అన్నగారు అన్ని విషయాలు మాట్లాడి వాళ్ళ తల్లిదండ్రులకు కబురు పంపేడట. ఈ విషయాలన్నీ శేషగిరి చెప్పగా తెలిసింది నాకు.

ఏ అమెరికా అమ్మాయినో పెళ్ళి చేసుకున్నానని చెప్పకుండా, మన దేశం అమ్మాయిని, అందులోనూ మన ప్రాంతం అమ్మాయిని, పైగా మన కులం అమ్మాయినే ప్రేమించానని, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని తల్లి తండ్రులకు చెప్పినందువల్ల, శేషగిరి కొడుకుపట్ల నిరసన తెలియజేయలేదు. కొడుకు తమ పరువు నిలబెట్టినందుకు సంబరపడ్డాడు. అయిన వాళ్ళందరికీ త్వరలో కొడుక్కు పెళ్ళి చేయబోతున్నట్టు ప్రకటించాడు.

పెళ్ళిచేసి చూడు, ఇల్లు కట్టిచూడు అని ఒకప్పుడు అదో సవాలుగా అనుకునేవాళ్ళు, డబ్బుండాలే గానీ ఇప్పుడు ఆ రెండూ పెద్ద సమస్యలేం కాదు. సంబంధాలు చూడటానికి చెప్పులే కాదు, కాళ్లూ అరిగేలా తిరిగేవాళ్లు, పూర్వకాలంలో పాపం! ఇప్పుడంత కష్టపడాల్సిన పనేం లేదు. పుస్తకాల్లోనూ, దినపత్రికల్లోనూ వివాహ వేదికలంటూ ప్రకటనలు, అవికాక కొత్తగా టీవీల్లో కూడా పెళ్లి సంబంధాల వివరాలు తెలియజేసే కార్యక్రమాలొచ్చినయ్. అమెరికా అబ్బాయి కావాలన్నా, ఐరోపా అమ్మాయి కావాలన్నా ఇంటర్నెట్‌లు వచ్చినయ్. కాలం మారిపోయింది. మనుషులూ, మనసులు కూడా మారిపోయినై. తప్పదు. మార్పు సహజం.

పెళ్లికూతురి తల్లిదండ్రులు, అక్క, బావా వచ్చి శేషగిరి దంపతుల్తో మాట్లాడి, వధూవరులకు అనుకూలమైన తేదీల్లో వివాహానికి ముహూర్తాలు పెట్టుకున్నారు. అమ్మాయి, అబ్బాయి పెళ్లి మర్నాడనగా వస్తారట. సరిగ్గా పెళ్లయిన అయిదో రోజున అమెరికాకు తిరుగు ప్రయాణం కావాలట. ఇద్దరూ

కొత్తగా ఉద్యోగంలో చేరినవారు కావడంతో శెలవు దొరకటం కష్టంట. అందుకే అంతకన్నా ఎక్కువ రోజులు వుండేందుకు కుదరదట. ముహూర్తాలు పెట్టుకున్న తర్వాత పెళ్లి పనులు ప్రారంభించారు శేషగిరి ఇంట్లో.

అమెరికానుండి వచ్చిన రోజునే సతీష్ మా ఇంటికి వచ్చాడు. పెళ్లికి వాళ్ల నాన్న పిలిచినా, తను ప్రత్యేకంగా ఆహ్వానించాలని వచ్చానని చెప్పేడు. పెద్ద సంపాదనాపరుడైనా మా పట్ల అతను చూపెట్టిన అభిమానానికి, ఆప్యాయతకు ముచ్చటేసింది నాకు.

"ఎలా ఉందయ్యా అమెరికా జీవితం" అడిగాను.

"చాలా బావుంది అంకుల్. అన్నింటికన్నా అక్కడ నాకు నచ్చింది వాళ్ల క్రమశిక్షణ, పంక్చువాలిటీ, వర్క్ అండ్ వర్షిప్ అనే వాళ్ల ఆలోచనా విధానం, నీట్‌నెస్, సివిక్ సెన్స్, సిన్సియారిటీ, సింప్లిసిటీ...ఇలా ఎన్నో..." క్లుప్తంగా చెప్పేడు పెళ్ళి హడావిడిలో వుండడంతో.

"పెళ్లికి మీరందరూ తప్పకుండా రావాలి. నేను ముందు మీ ఇంటికే వచ్చాను. మళ్లీ కలుస్తా" అని చెప్పి వెళ్లిపోయాడు సతీష్.

"పిల్లలంటే అలా వుండాలి. సతీష్ బుద్ధిమంతుడండీ" అంటూ నా పక్కన కూర్చుంది శ్రీమతి.

"అవును... అమెరికా వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకువస్తే చాలు గొప్ప వాళ్లయిపోయినట్లు ఫోజులిస్తున్న ఈ రోజుల్లో ఇంత వినయంగా ఉన్న సతీష్ నిజంగా బుద్ధిమంతుడే" అన్నాను.

"అమెరికాలో అర్హత ఉన్న వాళ్లకి, మెరిట్ చూసి ఉద్యోగాలిస్తారు తప్ప మనకులాగా మంత్రిగారి రికమండేషనుకో, రౌడీగారి బెదిరింపులకో ఉద్యోగాలివ్వరట"చెప్పింది మా పెద్దమ్మాయి.

"అక్కడ పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నవారు కూడా చాలా హాయిగా జనంలో తిరుగుతుంటారట. ఇక్కడయితే అధికారంలో ఉన్నవాళ్లు, వాళ్ల కుటుంబసభ్యులే కాదు, మాజీలకు, వారివారి అనుచరగణాలక్కూడా జనంలోకి రావటానికి రకరకాల రక్షణ ఏర్పాట్లు, రక్షక భటుల వలయాలు, రంగు పీలికలు తలలకు చుట్టుకుని వీరంగం వేసే అభిమానులు, కోలాహలం.. అదో ప్రహసనం" చెప్పేన్నేను.

అమెరికా ముచ్చట్లు, ఆంధ్రా అచ్చట్లు కాసేపు చర్చించుకుని భోజనాలకు ఉపక్రమించాము.

* * * *

సతీష్ పెళ్ళి ఘనంగా జరిగింది. పెళ్ళికూతురు చాలా అందగత్తె, అణుకువగల పిల్లగా అనిపించింది. ఈడూ జోడు బాగుందనిపించింది. వాళ్ళిద్దర్నీ చూడగానే భార్యని నాకు, మా కుటుంబసభ్యులకు పరిచయం చేశాడు సతీష్. పెళ్ళి భోజనాలను చేసి ఇంటిముఖం పట్టాం.

పది సంవత్సరాల కాలం గిర్రున తిరిగిపోయింది. సతీష్‌కు ఇద్దరు మగపిల్లలు. శేషగిరి కోరిక మేరకు భార్యా పిల్లల్తో అమెరికా వదిలేసి ఇక్కడే వుండిపోయేందుకు వచ్చేస్తున్నాడు. సతీష్ అమ్మానాన్నలు పెద్ద వాళ్లయిపోయారు. వారి శేష జీవితాన్ని మా సమక్షంలో గడపాలనుకుంటున్నారు. వారి కోరిక తీర్చేందుకు వచ్చేస్తున్నానని సతీష్ నాకూ ఓ ఉత్తరం వ్రాశాడు. అతడి నిర్ణయానికి చాలా సంతోషించాను. నాకూ వయసు పైబడింది. సతీష్‌ని చూడాలనే ఉబలాటం నాకూ కలిగింది. నిజానికి శేషగిరి వాళ్లతోపాటు మేం కూడా విమానాశ్రయానికి వెళ్లాలనే అనుకున్నాం గాని నా శ్రీమతి అనారోగ్యం కారణంగా వెళ్లలేకపోయాను.

సతీష్, భార్య పిల్లల్ని తీసుకుని మా ఇంటికి వచ్చాడు. ఉభయకుశలోపరి పూర్తయ్యింది. పిల్లలిద్దరూ ఎర్రగా, బొద్దుగా, ముద్దుగా ఉన్నారు. వాళ్ళిద్దరూ కూడా తెలుగు స్పష్టంగా మాట్లాడటం నాకు అమితంగా నచ్చిన విషయం.

"అన్నట్టు అంకుల్.... మీ కోసం ఓ చిన్న గిఫ్ట్" అంటూ బేగ్‌లోంచి ఓ సెంటు సీసా తీసి నా చేతికి ఇచ్చాడు సతీష్. అప్పటికే వంటగదిలో వాడుకునే వస్తువులేవో అతని భార్య నా శ్రీమతికి ఇచ్చి, అవి ఉపయోగించే విధానం చెప్తున్నది వంటగదిలో. మా మనవడికి, మనమరాలికి కూడా ఏవో ఆట వస్తువులు తెచ్చారు. నాకు ఇచ్చిన సెంటు సీసా చాలా పెద్దది. అది ఓపెన్ చేయటం ఎలాగో నాకు చేతకాలేదు. అతనే నా వద్దనుంచి సీసా తీసుకుని ఓపెన్ చేశాడు. నా చొక్కా మీద స్ప్రే చేశాడు. చక్కని వాసన ఆ పరిసరాన్నంతా ఆహ్లాదంగా మార్చింది.

"మీకు ఫర్ఫ్యూమ్సంటే ఇష్టంట కదా... అందుకే స్పెషల్ బ్రాండ్ తెచ్చాను" అంటూ సీసా మళ్ళీ నాకందించాడు.

"చాలా సంతోషం సతీష్. నువ్వు మీ అమ్మానాన్నల మాట కాదనకుండా వేలల్లో వచ్చే సంపాదనకన్నా కన్నవాళ్లు ముఖ్యం అనుకుని తిరిగి వచ్చేశావ్ చూడు.. అందుకు నిన్ను అభినందిస్తున్నానయ్యా" అన్నాను చెమ్మగిల్లిన కళ్లతో.

చిరునవ్వుతో కూర్చున్నాడు సతీష్.

"పెద్ద వాడ్నిగా ఇంకొక్క విషయం చెప్తాను. ఏమీ అనుకోవు కదా."

"భలేవారే... మీరు చెప్పాలి, మేము వినాలి."

"ఆ నమ్మకంతోనే చెప్తున్నాను... నువ్వు నాకిచ్చిన ఈ సెంటు చాలా ఖరీదైనదై వుంటుంది. చాలా చాలా బావుంది. ఈ పరిమళం తాత్కాలికం. కానీ నువ్వు అక్కడ గమనించిన వారి సిన్సియారిటీ, డిసిప్లేన్, వర్క్మైండ్... ఇత్యాది లక్షణాలు వున్నయ్యే అవి అసలైన ఫారిన్ సెంటు. వాళ్ళ దగ్గర మనం నేర్చుకోవాల్సినవి, అలవర్చుకోవలసినవి అవే. అందుకని వాటిని నువ్వు ఒంటబట్టించుకో. ఈ సెంట్లు వంటికి రాసుకుంటే కొన్ని గంటల వరకూ ఆ సువాసన మనకి, మన దగ్గర్లో ఉన్న వారికీ ఆహ్లాదాన్ని అందించగలదు కాని నే చెప్పిన ఆ ఫారిన్ సెంటు నీ జీవితాన్ని. నీ పరిధిలో ఉన్న ఎంతోమంది జీవితాల్ని ప్రభావితం చేయగలదు. మర్చిపోకు" భావోద్వేగంతో చెప్పేను

"తప్పకుండా" అంటూ నా చేతిలో చేయి వేశాడతను. తమ ఇంటికి కారులో బయలుదేరిన వారికి చేతులూపుతూ వీడ్కోలు చెప్పేను.

◆ జయం వారపత్రిక – 1 జనవరి, 2003 ◆